www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | మంగళ వారం 21 జూన్ 2022 | ఎడిటర్: గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-95 | పేజీలు - 4 వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



అందమైన బాల్యాన్ని బడిలోనే గడుపనిద్దాం,
బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం,
భావి భారత పౌరుల్ని కాపాడుకుందాం.

# తీరుమారని ప్రైవేట్ స్కూళ్ల వ్యాపారం

## తల్లిదండ్రులకు తప్పని పిల్లల చదువుల భారం



**హైదరాబాద్ డెస్క్, జూన్ 20 (సమ సమాజం):** ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఫీజుల విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాలు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వాటి నియంత్రణ దిశగా కనీస చర్యలకు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడి ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో విద్యను వ్యాపారం చేసేలా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దనే నిబంధనను ఉల్లంఘిస్తున్నా..చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమిషన్లతో వ్యాపారం .. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి. కొన్ని ప్రైవేటు బడుల్లో ఫీజులుం కొనసాగుతోంది. వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా నాణ్యమైన విద్య ముసుగులో అక్రమార్జనకు కొన్ని పాఠశాలలు తెరతీస్తున్నాయి. బడుల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దని.. ప్రభుత్వం, న్యాయస్థానం ఆదేశించినా జిల్లాలో ఆ వ్యవహారం బాహాటంగానే సాగుతోంది. కాసుల కక్కుర్తితో బడిలో వ్యాపారం నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారు చెప్పిన ఫీజును కాదనలేక.. పుస్తకాలను మరో చోట కొనలేక నానాతంటాలు పడుతున్నారు. ఎల్‌కేజీ విద్యార్థి పుస్తకాలకే రెండువేల వరకు ఖర్చువుతోంది. ఇక కెజీ పెరిగిన కొద్దీ రకరకాల పుస్తకాలు కావాలంటే జేబు గుల్లకాక తప్పడంలేదు. వీటికితోడుగా రాత కోసం మరో 10 నోటు పుస్తకాలను కొనాల్సిందే. ఒకటో తరగతిలో చేర్పించాలని ఓ బడిలోకి అడుగుపెట్టిన తండ్రి ఆనందం అక్కడి ఫీజులను చూసి క్షణాల్లో ఆవిరైంది. ఒకటో తరగతికి రూ. 12వేల ఫీజు. ఇది కాకుండా వెయ్యి రూపాయలు ప్రవేశ

2వ

# రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

## విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**రంగారెడ్డి, జూన్ 20 (సమ సమాజం):** టీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నదని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. శంకర్ పల్లి మున్సిపాలిటీలో ఫండ్స్ ద్వారా మంజూరైన రూ. 10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక కార్యక్రమాలు తెలంగాణలో జరుగుతన్నాయని అన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మిర్చితో నష్టం.. పత్తితో కలసి వచ్చేనా?

## గతానుభవాలతో మరోమారు పత్తివైపు మొగ్గు



**ఆదిలాబాద్, జూన్ 20 (సమ సమాజం):** అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్ముదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరోమారుపత్తి వేసేందుకు రైతులు

2వ

# బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- తక్షణం అఖిలపక్ష సమావేశంలో చర్చించాలి
- విద్యార్థుల సమస్యలపై తక్షణమే కమిటీ ఏర్పాటు చేయాలి
- సిఎం కెసిఆర్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ
- బిజెపికార్యవర్గా ఏర్పాట్లు పరిశీలించిన బండి సంజయ్



**హైదరాబాద్, జూన్ 20 (సమ సమాజం):** బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు టీబీజేపీ చీఫ్ బండి సంజయ్ లేఖ రాశారు. విద్యార్థులవి సిల్లీ సమస్యలన్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్షమాపణలు చెప్పాలనిన డిమాండ్ చేశారు. విద్యార్థుల 12 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. 6 రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా.. సీఎం కేసీఆర్‌కు పట్టదా అనిప్రశ్నించారు. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలపై అన్ని విద్యార్థిసంఘాలతో ప్రభుత్వం ఒక సమావేశం ఏర్పాటు చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. జాతీయ పార్టీ ఏర్పాటుకు మాత్రం సీఎంకు సమయం ఉంటుందా అని బండి సంజయ్ ప్రశ్నించారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల 12డిమాండ్లను వెంటనే ఆమోదించి పరిష్కరించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. వారి న్యాయమైన సమస్యలపై సీఎం నియంతలా వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలపై సీఎం నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. జాతీయపార్టీ ఏర్పాటుపై పొలిటికల్ స్ట్రాటజిస్టులతో, తెలంగాణ ద్రోహులతో సమావేశం కావడానికి సీఎంకు సమయం ఉంటుంది.. కానీ గత ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మాత్రం

2వ

# తరగతులకు హాజరు కాని బాసర విద్యార్థులు

- ఆందోళనలోనే ట్రిపుల్ ఐటి విద్యార్థులు
- మంత్రి ఇంద్రకరణ్ ఏనాడు పట్టించుకోలేదన్న విమర్శలు



**నిర్మల్, జూన్ 20 (సమ సమాజం):** మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ట్రిపుల్ ఐటీ విద్యార్థులు షాకిచ్చారు. సోమవారం నుంచి విద్యార్థులు తరగతులకు హాజరవుతారని మంత్రి ప్రకటించినా విద్యార్థులు మాత్రం తరగతులకు హాజరుకాలేదు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేదన్న ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన వచ్చేంత వరకు ఉద్యమం ఆగదని విద్యార్థులు స్పష్టం చేశారు. మరోవైపు బాసర ట్రిపుల్ ఐటిలో విద్యార్థుల ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో డిమాండ్ల పరిష్కారం కోసం సర్కార్ కసరత్తు ప్రారంభించింది. వీసీ నియమాకం కోసం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు వెంటనే యూనిఫామ్‌లు ఇవ్వాలని నిర్ణయించారు. ఉన్నతాధికారులతో భేటి తర్వాత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్‌లో ప్రకటన జారీ చేయనున్నట్లు సమాచారం. గత కొద్ది రోజులుగా బాసర ట్రిపుల్ ఐటీలో నడుస్తున్న వివాదానికి తెరపడే అవకాశం కనిపిస్తోంది. కొన్ని రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ వివాదానికి చెక్ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే విద్యార్థుల డిమాండ్ల పరిష్కారం కోసం కసరత్తు ప్రారంభించింది. అలాగే వైస్ ఛాన్సలర్

2వ

# ఆనాడు రైతుల ఉసురు .. ఇప్పుడు సైనికుల వంతు

### అగ్నిపథ్ పథకాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

### కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఎర్రబెల్లి



**వరంగల్, జూన్ 20 (సమ సమాజం):** రైతుల ఉసురు తీసింది సరిపోలేదని... ఇప్పుడు సైనికుల వెంట పడతున్నారా అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మోడీపై విరుచుకుపడ్డారు. అగ్నిపథ్ పై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ... జై జవాన్, జై కిసాన్ అనేది భారత దేశ నినాదమని, అయితే నల్ల చట్టాలతో రైతులు, అగ్నిపథ్ తో సైనికులను బలి తీసుకునేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. సైనికుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ... ఇప్పుడు అదే సైనిలకుల ప్రాణాలను రిస్క్‌లో పెట్టారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్రంలో మూర్ఖపు ప్రభుత్వం నడుస్తోందన్నారు. అగ్నిపథ్ పనికిమాలిన స్కీం అని, దాని వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ ఉందన్నారు. అగ్నిపథ్ చాలా మంచి పథకమని బీజేపీ నాయకులు చెబుతున్నారన్న మంత్రి... దమ్ముంటే ముందు తమ పిల్లలను ఆర్మీలో చేర్పించాలని

2వ

# తెలంగాణపై బిజెపి ఫోకస్: ఈటెల



**న్యూఢిల్లీ, జూన్ 20 (సమ సమాజం):** బీజేపీ నాయకత్వం రాష్ట్రంపై సీరియస్ గా ఫోకస్ చేసిందని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు అమిత్ షా కార్యాచరణ రూపొందించారని, దాన్ని తనకు వివరించారని చెప్పారు. అమిత్ షా పిలుపు మేరకు తాను ఢిల్లీ వచ్చానని, ఆయనతో దాదాపు 20 నిమిషాల పాటు భేటీ అయ్యానని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చే కార్యాచరణపై చర్చించామన్నారు.

# మరోమారు ఈడి ఎదుట హాజరైన రాహుల్

### ఢిల్లీలో పలుప్రాంతాల్లో భద్రత పెంచిన పోలీసులు




**న్యూఢిల్లీ, జూన్ 20 (సమ సమాజం):** నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి సోమవారం ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అధికారులు రాహుల్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు రాహుల్‌ను 30 గంటలపాటు ఈడీ ప్రశ్నించింది. కాగా కాంగ్రెస్ ఆందోళనలతో ఈడీ కార్యాలయం, జంతర్‌మంతర్ దగ్గర పోలీస్ భద్రత పెంచారు. అలాగే ఏఐసీసీ కార్యాలయం దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఏఐసీసీ ఆఫీస్‌లోకి పోలీసులు అనుమతించడం లేదు. ఈనెల 13 నుంచి 15 వరకు

2వ

# నగరంలో ట్రాఫిక్ నిర్మూలనకు చర్యలు

### కూకట్‌పల్లి ప్రాంతంలో మరో ఆర్వోబి నిర్మాణం

### నేడు ప్రారంభించనున్న మంత్రి కెటిఆర్



**హైదరాబాద్, జూన్ 20 (సమ సమాజం):** హైదరాబాద్ మహానగర ట్రాఫిక్ సమస్యలకు అనేక యత్నాలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఫ్లై ఓవర్లు, ఆర్వోబిల నిర్మాణంతో పరిస్థితులు చక్కబడుతున్నాయి. ట్రాఫిక్ పద్మవ్యూహాలను అధిగమించేలా చేస్తున్నారు. వ్యూహాత్మక దారులతో నగరవాసులు ఊరట పొందుతున్నారు. తాజాగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో కైత్లాపూర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు రూ. 83కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రానున్నది. మంగళవారం 21తేదీన పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ ఆర్వోబీని ప్రారంభించనున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లైత్లాపూర్ ఆర్‌వోబీని మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు, టీఆర్ఎస్ పార్టీ నేతలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా, ట్రాఫిక్ రహితంగా అభివృద్ధి

2వ

# అగ్నిపథ్ వ్యతిరేకతపై రంగంలోకి బిజెపి

### యువతకు అవగాహన కల్పించాలని నడ్డా పిలుపు



**న్యూఢిల్లీ, జూన్ 20 (సమ సమాజం):** అగ్నిపథ్ వ్యవహారంపై దేశంలో వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్న నేపథ్యంలో యువతలో అవగాహన కల్పించేందుకు బీజేపీ సిద్ధమైంది. ఎక్కడైతే వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్నాయో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి యువతకు అవగాహన కల్పించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారు. దేశ భవిష్యత్తును రక్షణను భద్రతను అన్నీ దృష్టిలో పెట్టుకొని అగ్నిపథ్ పథకాన్ని తీసుకు వచ్చినట్లుగా యువతకు చెప్పాలని ఆయన సూచించారు. అగ్నిపథ్ పథకాన్ని అమలు చేయకుండా సైనిక బలగాలు నియామకాల పక్రియను మరింత ఆలస్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని యువతకు చెప్పాలని తెలిపారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల నాయకత్వానికి, కేంద్ర కార్యాలయంలో ముఖ్యులకు సమన్వయ బాధ్యతలను నడ్డా అప్పగించారు.

# సంపాదకీయం

## మానసిక, శారీరక ఆరోగ్య ప్రక్రియ యోగా !

మానవుల ఆరోగ్యాన్ని,శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకునేలా రూపొందించిన అద్భుత ప్రక్రియ యోగ. ఇది ప్రపంచానికి భారతదేశం అందించిన మహత్తర ప్రక్రియ. యోగాతో మనిషి శరీరం, మనస్సు, ఆరోగ్యం అదుపులో ఉండగలవు. భారతదేశం చేసిన ప్రయత్నంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగగా దినోత్సవంగా గుర్తించింది. దీంతో యోగాకు ప్రాధాన్యంతో పాటు, అంతర్జాతీ యంగా దీనిని ఆచరించే వారి సంఖ్య పెరిగింది. యోగా చేస్తున్న వారిలో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉండవని నిరూపితం అయ్యింది. నిత్యంయోగా చేసిన వారు ఆనందంగాను, ఉత్సాహంగానూ ఉండడాన్ని గమనించవచ్చు.యోగాతో మనస్సు, వరీరం అదుపులో ఉంటుందని కూడా నిరూపితం అయ్యింది. ఇది వేల ఏళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. అందుకే ఐక్యరాజ్యసమితి మన వినతిని గుర్తించిఅంతర్ఆజతీయయోగా దినోత్సవాన్ని ప్రకటించింది. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఆరోజు ఉత్తరార్ధ గోళంలో అత్యధిక పగటి సమయం కావడమే. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా దినోత్సవం అందుబాటులోకి వచ్చాక దీనిని ఓ కార్యక్రమంగగా కాకుండా నిరంతర ప్రక్రియగా ఆచరించడం మొదల య్యింది. అనేక దేశాలు, దీనిని ఆరోగ్యంలో భాగంగా అమలు చేస్తున్నాయి. ముస్లిం దేశా సైతం దీని ప్రాధాన్యాన్ని గుర్తించాయి. దీర్ఘకాలిక రోగాలను సైతం అదుపు చేసే అవకాశంయోగా ద్వారా లభించగలదు. శరీరం సౌష్టవంగా ఉండేందకు కూడా యోగా ఉపయోగపడుతుందిం. యోగా అనేది 5వేల సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానం యొక్కఅంతర్భాగంగా గుర్తించారు. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలంకొన్నిశారీరిక కదలికలు ,ఇంకా శ్వాస పక్రియ అని మాత్రమే అనుకుంటారు. నిజానికి మానవుని అనంతమైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయికగా నిరూపితం అయ్యింది. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటేపరిపూర్ణ జీవనసార విధానం. దీనిలోజ్ఞాన యోగము (తత్వశాస్త్రము ), భక్తి యోగము , రాజ యోగం మరియు కర్మ యోగములు ఉన్నాయి. యోగాసనాలు అంటే రాజయోగ పక్రియలో పైనచెప్పిన యోగాలన్నిటిలో సమతౌల్యాన్ని , ఏకత్వాన్ని తీసుకువస్తాయి. యోగా అనేది ఆరోగ్యకరమైన శక్తిని పుంజు కునే ఆనందకరమైన అనుభూతి. ఇది సులభమైన, కష్టతరమైన శ్వాసపక్రియతో కూడుకున్నటువంటి పక్రియ. దీనిద్వారా శారీరక , మానసిక సమతౌల్యంఏర్పడుతుంది. ఇది ఒక బహుముఖ ప్రజ్ఞానాన్నికలిగించే కార్యక్రమం. ఇందులోయోగాసనాలు,శ్వాసపక్రియ , యోగాకి సంబంధించిన జ్ఞానము. ఇంకా ధ్యానము పొందు పరిచబడి ఉంటాయి. ఇది నేర్చుకునే విద్యార్థులకు తమను తాము ఇంటి వద్ద నే చేసుకోవచ్చు. ఇది క్రోతగా నేర్చుకునేవారికి , రోజు సాధన చేసుకునేవారికీ అన్నిరకముల వయసుల వారికి ఉపయోగ పడుతుంది. చేసేవారి జీవన విధానములో ఎన్నో గొప్ప మార్పులు చోటుచేసుకున్నాయి. దీర్ఘ కాలికమైన అనారోగ్యాల నుండి బయట పడ్డారు. ఇంకొందరికి ఇతరులతో మసలుకొనా విధానంలో మార్పులు వచ్చాయి. నెర్చుకునే వ్యక్తులు వారి అనుభూతులని వివవరించారు. వారు ఎంతో సంతోషంగా, ఆతురత తగ్గి,ఓర్పు పెరిగి,కుశల బుద్ధి కలిగి, పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. యోగాలో ఉన్న అద్భుతమేమంటే యోగాసనాలు శరీరానికి ధృడత్వాన్ని,శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైన, చిన్నవారైన, ధృడంగాఉన్నవారైన,లేనివారైన ఆసనాలు వేయడానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్దీ ఆసనాల వెనకాల ఉన్న అంతరార్ధం బాగా అవగాహనకు వస్తుంది. ఆసనంలో ఉంటూనే బాహ్య కరమైన శారిరిక క్రమం నుంచి అంతరంగిక పరివక్రుత అనుభూతిలోకి వస్తుంది. యోగ ద్వారా గర్భిణుల ఆరోగ్యం కుదుటపడి, టెన్షన్ల నుంచి బటపడుతున్న తీరు చూస్తున్నాం. అలాగే ఎన్నోరకాల మానసిక రుగ్మతలకు యోగా ద్వారా పరిష్కారం దక్కుతోంది. యోగ మన జీవితంలోని అంతర్భాగమే. యోగ అనేది ఒక్కొక్క రకంగా అర్థమవుతుంది. యోగాలో ప్రధానమైనది ప్రాణాయామం. అనగా ఒకరి శ్వాస మీద పట్టు సాధించడం. ఇంకా శ్వాసను పీల్చే శక్తిని పెంచడం. సరైన శ్వాస పక్రియ శరీరంలోని అధిక ప్రాణవాయువును రక్తంలోనికి, మెదడులోనికి ప్రసరింపచేసి ప్రనసక్తిని పెంపొందిస్తుంది. ప్రాణాయామం అనేక యోగాసనాలు వేయటంలో దోహదపడుతుంది. ఈ రెండింటి సమ్మేళనము ప్రాణాయామం. యోగాసనాలు శరీరానికి మనస్సుకు స్వచ్ఛతను, వ్యక్తిగత అనుసాసనాన్ని ఇస్తాయి. ప్రాణాయామం యొక్క మెళకువ మనలను లోతైన లేదా ఘాఢమైన ధ్యానములోనికి తీసుకువెళుతుంది. యోగ సూత్రాలను సరళంగా, వివరంగా, అందరికి అందుబాటులోనికి తీసుకురావటమే లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అత్యంత లాభాన్ని నిజజీవితంలో ఎలా అనుభవించగలం అన్న అంశం మీద ఇది కేంద్రీకృతమై ఉంటుంది. ఆరోగ్య సమస్యలు గాని, భావావేశాలు గాని, వ్యక్తిగత జీవితం పైన ప్రభావాన్ని చూపుతుంటాయి. అలాంటి వారు యోగా సాధన ద్వారా ఉపశమనం పొందవచ్చని నిరూపింతం అయ్యింది. జీవన సరళిలో చిన్న చిన్న మార్పులతో సమస్యలని సహజంగానే అధిగామించడం సాధ్యమనికూడా తెలుసుకోవచ్చు. నిత్యంయోగా చేస్తూ ఆనందమయ జీవితం పొందడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఓ అరగంటయినా కేటాయిస్తే మంచి ఫలితం దక్కవచ్చు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# ఆందోళనకారులను కలుసుకునేందుకు తల్లిదండ్రుల రాక


తమ పిల్లలు నిర్దోషులని..దాడితో సంబంధం లేదని వాదన ● వారిని వెంటనే విడుదల చేయాలంటూ వినతి ● అగ్నిపథ్ ఆందోళనలపై కొనసాగుతున్న విచారణ



**హైదరాబాద్, జూన్ 20(సమ సమాజం):** చంచల్‌గూడ జైలు ములాఖత్‌లతో కిక్కిరిసిపోయింది. సికింద్రాబాద్ అల్లర్ల కేసులో 46 మంది యువకులు అరెస్టు కావడంతో.. వారి పరామర్శ కోసం కుటుంబసభ్యులు జైలుకు వచ్చారు. ములాఖత్ కోసం ఇప్పటికే 300 మంది కుటుంబ సభ్యులు రిజిస్టర్ చేసుకున్నారు. మరోపక్క అల్లర్ల కేసులో అరెస్టైన వారి కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలకు అల్లర్లతో ఎలాంటి సంబంధం లేదంటున్నారు. వారిని విడుదల చేయాలని విలపించారు. అగ్నిపథ్‌కి వ్యతిరేకంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగిన అల్లర్ల కేసులో పలువురు యువకులు అరెస్టయ్యారు. వీరంతా చంచల్‌గూడ జైల్లో ఉన్నారు. యువకులను కలిసేందుకు వారి కుటుంబ సభ్యులు జైలు వద్దకు చేరుకున్నారు. చంచల్‌గూడకు చేరుకున్న తల్లిదండ్రులతో ఆ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ విధ్వంసం కేసులో తమ పిల్లలకు ఎలాంటి సంబంధంలేదని చంచల్‌గూడ జైలులో ఉన్న నిందితుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తమ పిల్లలను విడుదల చేయాలని విలపించారు. చంచల్‌గూడ జైలుకు వచ్చిన నిందితుల తల్లిదండ్రులు.. పెద్ద సంఖ్యలో చేరుకుని ములాఖత్‌లో కలుసుకున్నారు. దాడికి ముందు కొందరు ఆందోళనకారులు స్టేషన్ బయట బస్సులను ధ్వంసం చేశారు. దాడికి పాల్పడిన ఆందోళనకారులపై పీఎస్‌లో 2 కేసులు నమోదు అయ్యాయి. 143, 341,186, 427, 149 ఐపీసీ పబ్లిక్ ప్రాపర్టీ 3 యాక్ట్ కింద రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దాడికి పాల్పడిన ఆందోళనకారుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు అగ్నిపథ్?ను వ్యతిరేకిస్తూ.. సికింద్రాబాద్‌లో చేసిన ఆందోళనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనలో సాయి డిఫెన్స్ అకాడమి నిర్వహిస్తున్న సుబ్బారావు నరసరావుపేట పోలీసుల అదుపులో ఉన్నాడు. ఈ విధ్వంసంలో సుబ్బారావు పాత్ర ఉందని భావించిన పోలీసులు.. అతడిని అరెస్ట్ చేసి మూడు రోజుల నుంచి పలు కోణాల్లో గోప్యంగా విచారిస్తున్నారు. సుబ్బారావుపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఆయన అల్లర్లకు ప్రేరేపించినట్లు ఇంకా ఆధారాలు లేవన్నారు. మరింత సమాచారం కోసం టెక్నికల్ డిపార్టుమెంట్‌లోని నిపుణులను సంప్రదించినట్లు పేర్కొన్నారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా నరసరావుపేట రైల్వేస్టేషన్ వద్ద భద్రత పెంచారు. అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ... సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిరసనకారులు ఆందోళనకు దిగారు. రైలు బోగిలకు నిప్పుపెట్టడంతోపాటు... స్టేషన్ బయట ఉన్న ఆర్టీసీ బస్సులపై దాడులు చేశారు. ఆందోళనకారుల నిరసనలతో... సికింద్రాబాద్ ప్రాంగణం అట్టుడికిపోయింది. అగ్నిపథ్ గురించి ప్రకటన వచ్చినప్పటి నుంచి ఆందోళనకారులు నిరసనకు ప్రణాళిక వేసినట్లు తెలిసింది. తెలంగాణలో వివిధ జిల్లాల నుంచి యువకులు రాత్రే హైదరాబాద్ వచ్చినట్లు సమాచారం. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారాన్ని ఆందోనకారులు యువతకు చేరవేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. జిల్లాల వారీగా ఆందోనకారులు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిరసనకు ఆందోళనకారులు నిన్న రాత్రే వచ్చినట్లు వెల్లడించారు. స్టేషన్ బయట ఓ బస్సు అద్దాలు పగుల గొట్టి.. ఉదయం 9 గంటల వేళ ఒక్కసారిగా స్టేషన్లోకి దూసుకొచ్చినట్లు చెప్పారు.

# సికింద్రాబాద్ విధ్వంసం వెనక టీఆర్ఎస్

కావాలనే చోద్యం చూస్తూ గడిపారు ❑మండిపడ్డ ఎమ్మెల్యే రఘునందన్ రావు




**నల్లగొండ, జూన్ 20(సమ సమాజం):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో రోజంతా విధ్వంసం చేస్తుంటే ఏం చేస్తున్నారని, ప్రతిపక్షాలను వెంటాడి అరెస్టులు చేస్తున్న వారికి ఇది కనిపించలేదా అని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘనందన్ రావు ప్రశ్నించారు. అధికార పార్టీ కావాలనే చేయించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. నల్గొండ పట్టణంలో ఉమ్మడి నల్గొండ జిల్లా బీజేపీ శక్తి కేంద్రాల ఇంచార్జీలు, కార్యవర్గ సమావేశానికి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా భారత ప్రభుత్వాన్ని బదనాం చేస్తూ ప్రతిపక్షాలు.. ఈ రాష్ట్ర పాలక పక్షం ప్రవర్తించిన తీరు బాధకారం అన్నారు. ముఖ్యమంత్రి. ఎమ్మెల్యేల పర్యటనలలో ప్రతిపక్షాలను వెంటాడి అరెస్టులు చేయిస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. చనిపోయిన వ్యక్తి మీ టీఆర్ఎస్ పార్టీ సొత్తా..? వేరే పార్టీ వాళ్లు రాకూడదా ? అని ఆయన ప్రశ్నించారు. అధికార పార్టీ డబ్బులిచ్చి కావాలని చేయించిందే ఈ ఘటన అని విమర్శించారు. ఈ దేశానికి సేవ చేయాలినుకునే అభ్యర్థులు ఇతరుల మాట విని తప్పుదోవ పట్టొద్దని ఆయన హెచ్చరించారు. ఎంతోమంది మేధావుల ఆలోచనలు, సమీక్షల తరువాతే తీసుకొచ్చిన పథకం అగ్నిపథ్ అన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా మిలిటరీ మారుతూ ఉంటుందని.. దానికి అనుగుణంగా నిర్ణయం తీసుంటుందని పేర్కొన్నారు. వచ్చే నెలలో హైదరాబాద్ లో జరిగే ప్రధాని మోడీ బహిరంగ సభకు జిల్లాకు లక్షమంది చొప్పున తరలించడానికి అన్ని జిల్లాలలో సమావేశాలు నిర్వహిస్తున్నామని రఘునందన్ రావు తెలిపారు.

## యశోదలో చేరిన సిఎం సతీమణి శోభ మోకాలి నొప్పికి ఆపరేషన్ చేసిన వైద్యులు



**హైదరాబాద్, జూన్ 20(సమ సమాజం):** ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సతీమణి శోభ అనారోగ్య కారణాలతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత కొన్ని రోజులుగా ఆమె మోకాలి నొప్పితో బాధపడుతున్నారు. ఈ నొప్పి తీవ్రం కావడంతో ఆదివారం సాయంత్రం సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో కుటుంబసభ్యులు చేర్చారు. నొప్పి తీవ్రంగా ఉండడంతో ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. సీఎం కుటుంబసభ్యుల అంగీకారంతో శోభకు యశోద ఆస్పత్రి డాక్టర్లు మోకాలి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం శోభ స్వల్ప అస్వస్థతతో ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. శోభను పరామర్శించేందుకు కాసేపట్లో కేసీఆర్ యశోద ఆసుపత్రికి వెళ్తారని ప్రగతి భవన్ వర్గాలు ప్రకటించాయి.

# ఆనాడు రైతుల ఉసురు.. ఇప్పుడు సైనికుల వంతు



(మొదటి పేజీ తరువాయి) బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. ఆర్మీ ఉద్యోగాల కోసం కొన్ని నెలలుగా ఎంతో మంది అభ్యర్థులు సమాయత్తమవుతున్న తరుణంలో... నాలుగేళ్లే ఉద్యోగం అంటూ మోడీ ప్రభుత్వం యువత ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. నాలుగేళ్ల తర్వాత తమ ఆఫీసుల్లో సెక్యూరిటీ గార్డులుగా నియమించుకుంటా మంటూ బీజేపీ నాయకులు సైనికులను కించపరిచేలా మాట్లాడటం విచారకరమన్నారు. మతం పేరు తో రాజకీయాలు చేయడం తప్ప... బీజేపీకి అభివృద్ధి చేయడం చేతకాదన్నారు. అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతోంటే... పీఎం మోడీ స్పందించకపోవడం దారుణ మన్నారు. ఓ వైపు యువత చనిపోతుంటే ... అగ్నిపథ్ నోటిఫికేషన్ రిలీజ్ చేయడమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి అగ్నిపథ్ ను వెనక్కి తీసుకోవాలని, అలాగే ఆందోళన చేసిన అభ్యర్థులపై కేసులను ఎత్తేయా లని డిమాండ్ చేశారు. యువత ఎట్టిపరిస్థితుల్లో సంయమనం కోల్పోవద్దని, శాంతియు తంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాకేశ్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇదిలావుంటే చదువు వ్యక్తిత్వ, సమాజ వికాసానికి దోహదం చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తొర్రూరులోని అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చదువు అభివృద్ధికి బాటలు వేస్తుంది. సామాజిక గౌరవాన్ని కల్పిస్తుందన్నారు. చదువు ఒక్కటే మనిషిని సమున్నతంగా తీర్చిదిద్దుతుంది. అందరూ బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. సీఎం కేసీఆర్‌విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. మన ఊరు- మన బడి కింద రూ.7,289 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లీష్ మాధ్యమంలోకి మారుస్తున్నాం. ప్రభుత్వం అనేక ఆశ్రమ పాఠశాలలు పెట్టి విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఉద్యోగార్థులకు ఉచిత కోచింగ్ ఇప్పిస్తున్నాం. విదేశీ విద్య కోసం ప్రత్యేక పథకం పెట్టి పేద విద్యార్థులను ప్రభుత్వం చదవిస్తున్నదని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తీరుమారని ప్రైవేట్ స్కూళ్ల వ్యాపారం

(మొదటి పేజీ తరువాయి) రుసుం. ఏడాదిలో అడపాదడపా రూ.500 చొప్పున ఐదారుసార్లు పలు అంశాలను నేర్పేందుకు ఫీజు చెల్లించాలి. బడికి బస్సులోనే పంపాలి. ఇందుకోసం నెలకు రవాణా రుసుం కట్టాలి. పుస్తకాలకు డ్రెస్‌లకు మరో రెండు వేలు, బెల్టు, బ్యాగు, బూట్లు ఇతర నోటు పుస్తకాలకు మరో మూడువేలు వసూల చేస్తున్నారు. పిల్లలుఫలానా షాపులోనే ఇవన్నీ కొనే విధంగా రహస్య ఒప్పందాలు కొందరు కుదుర్చుకున్నట్లు సమాచారం. పుస్తక దుకాణాల వారే అధికంగా అన్ని పాఠశాలలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 400 నుంచి 1200 మంది పిల్లలు ఉంటున్నారు. ఇలా వారి సంఖ్యను బట్టి బడులకు కమిషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలన్నీ అక్కడే కొనాలే నిబంధనను పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాసంస్థలు కోట్ల రూపాయల్లో లావాదేవీలు చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధరల్ని నిర్ణయించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలతోపాటుగా నోటు పుస్తకాలను అమ్ముతున్నారు. ఏ ఒక్కటి తీసుకోకున్నా ఒప్పుకోవడం లేదు. సట్టణంలో ఒకటి రెండు బడులకు మినహాయిస్తే ఏ ఒక్క చోట విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. పైగా విద్యార్థులకు క్రీడల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఫీజు వసూలు చేస్తున్నారు. మైదానం సంగతేంటని.. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారంలో ఒక రోజు పట్టణశివారులో ఉన్న మైదానానికి పిల్లలను బస్సులో తీసుకెళ్తామనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

# బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి) కేసీఆర్‌కు టైం దొరకదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ విదేశీ పర్యటనకు, కేసీఆర్ వ్యక్తిగత ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారు.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం కోసం నిధులు ఉండవా అని ప్రశ్నించారు.విద్యార్థుల డిమాండ్లను సిల్లీ డిమాండ్లుగా పేర్కొన్న మంత్రి సబితా బేషరతుగా వారికి క్షమాపణ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. మంత్రులు, అధికారులు విద్యార్థులతో మైండ్ గేమ్ ఆడటం మానుకోవాలని హితవు పలికారు. గోబెల్స్ ప్రచారం చేస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి సమస్య పరిష్కారమైందని చెప్పడం ప్రభుత్వ దివాళకోరుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రులు, అధికారులు, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదిలావుంటే నగరంలోని నోవాటెల్‌లో జరుగనున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల ఏర్పాట్లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ , స్టీరింగ్ కమిటీ సభ్యులు సోమవారం ఉదయం పరిశీలించారు. జూలై 2,3,4 తేదీల్లో హైదరాబాద్ వేదికగా బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగనున్నాయి. సమావేశాలకు ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా, కేంద్ర క్యాబినెట్, బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. సుమారు 350మంది ప్రతినిధులు సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో ప్రతినిధుల కోసం బీజేపీ రాష్ట్ర నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

## తరగతులకు హాజరు కాని బాసర విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి) నియమాకం కోసం ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ వేసే అవకాశం ఉంది. విద్యార్థులకు వెంటనే యూనిఫామ్‌లు ఇవ్వాలని నిర్ణయించింది. ఉన్నతాధికారులతో భేటి తర్వాత హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటన జారీ చేయనున్నారు. ఇదిలావుంటే జిల్లా మంత్రిఇంద్రకరణ్ రెడ్డి ఏనాడూ సమస్యలు పట్టించుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏనాడూ ఇక్కడకి విద్యార్థులతో సమస్యలపై చర్చించలేదని అంటున్నారు.

# మరోమారు ఈడి ఎదుట హాజరైన రాహుల్

(మొదటి పేజీ తరువాయి) మూడు రోజుల పాటు ఈడీ అధికారులు రాహుల్ గాంధీని ప్రశ్నించారు. తిరిగి శుక్రవారం 17న విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశించింది. అయితే శుక్రవారం రాలేనని, రెండు రోజుల తర్వాత వస్తానని రాహుల్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి సోనియా గాంధీ యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత తనపై ఉందని ఈడీకి తెలిపారు. రాహుల్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఈడీ అధికారులు తిరిగి సోమవారం విచారణకు హాజరు కావాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

# మిర్చితో నష్టం.. పత్తితో కలసి వచ్చేనా?

(మొదటి పేజీ తరువాయి) సమాయత్తం అయ్యారు. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది. జిల్లాలో 3,630 ఎకరాల్లో మిరప పంట సాగు చేసినట్టు అధికారిక సమాచారం ఉండగా.. అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అందుకు తగ్గట్లు ధర లేకపోవడం మిరప రైతులను కుదేలు అయ్యేలా చేసింది. స్థానికంగా మిరప పంటను కొనుగోలు చేసేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో జిల్లా రైతులు పక్క రాష్ట్రంలోని నాగ్‌పూర్ మార్కెట్‌పై ఆధారపడ్డారు. గతేడాది పలికిన ధరే ఈసారి పలుకుతుందని.. కష్టాలు తీరుతాయని కౌలుకు తీసుకొని కొందరు పంట సాగు చేశారు. మిర్చి ద్వారా నష్టపోయిన రైతులు ఇప్పుడు పత్తి ద్వారా అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

# నగరంలో ట్రాఫిక్ నిర్మూలనకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి) చేసిన మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ బ్రిడ్జి రాకతో కూకట్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలో సులభంగా హైటెక్ సిటీకి చేరుకోనున్నారు. మరోవైపు జేఎన్‌టీయూహెచ్ హైటెక్ సిటీ మార్గంలోని ఫ్లై ఓవర్, అండర్‌పాస్ బ్రిడ్జిలపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది. కైత్లాపూర్ ఆర్వోబీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.83.06కోట్లు ఖర్చు చేసింది. రైల్వే పనులకు రూ. 18.06కోట్లు, భూ సేకరణకు రూ.25కోట్లు, నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ రూ. 40కోట్లు వెచ్చించింది. 675.50 మీటర్ల పొడవులో ఆర్వోబీ చేపట్టింది. 46 మీటర్ల మేర రైల్వే స్పాన్, 16.61 మీటర్లలో నాలుగు లేన్ల బైడైరెక్షన్లలో నిర్మాణం జరిగింది. 5.50 మీటర్లలో సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడం ద్వారా ప్రస్తుతం ఉన్న జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ బ్రిడ్జిలపై వాహనాల రద్దీ తగ్గుతుంది. మలేషియా టౌన్‌షిప్ జంక్షన్, హైటెక్‌సిటీ ల ఓవర్, సైబర్ టవర్స్ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ సమస్య శాశ్వతంగా తగ్గుతుంది. సనత్‌నగర్, బాలానగర్, మూసాపేట ప్రాంతాల మీదుగా వచ్చే వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా హైటెక్‌సిటీకి సులువుగా చేరుకోవచ్చు. దీంతో జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీ ల ఓవర్ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. దాదాపు 5 కిలోమీటర్ల మేర దూరభారం తగ్గుతుంది. సుమారు గంట సమయం ఆదా అవడంతో పాటు సులువుగా ప్రయాణం చేసే అవకాశం ఏర్పడుతుంది. కైత్లాపూర్ ఆర్‌వోబీతో కూకట్‌పల్లిలో ట్రాఫిక్ కష్టాలన్నీ తీరుతాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కైత్లాపూర్ ఆర్‌వోబీ ప్రారంభోత్సవం పనులను ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి అంటేనే ట్రాఫిక్ కష్టాలు అని భయపడే రోజులుండేవి.. ఎనిమిదేండ్ల టీఆర్ఎస్ పాలనలో వంద కోట్ల రూపాయలతో కేపీహెచ్‌బీ కాలనీల్లో ల ఓవర్, రూ.60 కోట్లతో కాలనీ 7వ ఫేజ్‌లో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి (ఆర్‌యూబీ), బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో సుమారు రూ.400 కోట్లతోల ఓవర్ బ్రిడ్జిని నిర్మించినట్లు తెలిపారు. తాజాగా, రూ.86 కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ ఫ్లైల ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తుండటంతో కూకట్‌పల్లి హైటెక్ సిటీ మార్గంలో వెళ్లే వారికి ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయన్నారు. కూకట్‌పల్లి, బాలానగర్, ఫతేనగర్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ బ్రిడ్జి మార్గంలో సులభంగా హైటెక్ సిటీకి చేరుతారని తెలిపారు. మరోవైపు జేఎన్‌టీయూహెచ్ హైటెక్ సిటీ మార్గంలోని ఫ్లై ఓవర్, అండర్‌పాస్ బ్రిడ్జిలపై ట్రాఫిక్ ఒత్తిడి కూడా తగ్గుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ట్రాఫిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

మంగళ వారం / 21. 6. 2022
www.samasamajam.in
సమ సమాజం


# వేల్పుగొండ పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం



**అందోల్, జూన్ 20 (సమ సమాజం):** మెదక్ జిల్లా, టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో మన ఊరు మన బడి ప్రణాళికలో భాగంగా నేడు బడి బాట ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు చే ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. విద్యార్థులకు మంచి బొదన కల్పిస్తూ నేటి ఈ సంవత్సరం నుండి అంగ్ల విద్యను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా పాఠశాలలో విద్యా బోధన అందించడం జరుగుతుందని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ ఉపాధ్యాయులు ఎల్లమ్మ, మాధవి, నాగరాణి, అంగన్ వాడి కార్యకర్తలు సంగమని, కవిత పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ శ్రీ బీరప్ప స్వామి కామరతి దేవి కళ్యాణ మహోత్సవం



**ఇబ్రహీంపట్నం, జూన్ 20 (సమ సమాజం):** ఇబ్రహీంపట్నం మండలం కప్ప పహాడ్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ బీరప్ప స్వామి కామరాతి దేవి కళ్యాణ మహోత్సవం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ప్రముఖులు రాజ్యసభ సభ్యులు బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య,స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ఎంపీపీ కృపేష్,మాజీ ఎంపీపీ వర్త్యావత్ రాజు నాయక్,సర్పంచ్ సామల హంసమ్మ యాదగిరిరెడ్డి,టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్ మంగమ్మ హాజరయ్యారు.జాతర నిర్వహకులు నిట్టు జగదీష్ మాట్లాడుతూ, బీరప్ప స్వామి జాతర దాదాపు 20 సంవత్సరాల తర్వాత తిరిగి తమ గ్రామంలో జరుగుతుందని,ఈ జాతర ప్రతి ఇంటా గ్రామ ప్రజలందరూ నిర్వహిస్తారని ఒక పండుగల వారంపాటు జరుపుకుంటారని తెలిపారు.అదేవిధంగా కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన అతిరథమహారథులు, జాతర కు సహకరించిన అటువంటి పెద్దలు ప్రజాప్రతినిధులు నాయకులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెరాస రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి నాయకులు ,సామల శ్రీనివాసరెడ్డి,ఏనుగు భరత్ రెడ్డి,నిట్టు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గణేష్,బీసీ ఫ్రంట్ మల్లేష్, కురుమ సంఘం నాయకులు , పలు పార్టీల నాయకులు, పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) సేవలు మరువలేనివి

## సాయి రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూన్ 20 (సమ సమాజం):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండల కేంద్రంలో బంటి యూత్ ఫోర్స్ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తోపు సాయి రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం లో ఏర్పాటుచేసిన బంటి యూత్ ఫోర్స్ తెలంగాణ రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి చేసిన సేవలు చెప్తున్నారని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను స్వయంగా దగ్గర ఉండి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి మరీ అందించడం సంతోషకరమనీ, బంటి లాగా యువతకు ఉత్సాహాన్ని కలిగిస్తూ, యువతను ముందుకు నడిపించాలనే తాపత్రయాన్ని మంచి మనసు కలిగి ఉండాలని కోరారు. ఎంతోమందికి బంటి యూత్ తరఫున నిరుద్యోగ యువతకు అవకాశాన్ని చేకూరుస్తున్న బంటి యూత్ ఫోర్స్ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ముందు ముందు రాబోయే రోజుల్లో బంటి యూత్ ఫోర్స్ మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని అలాగే బంటి యూత్ కార్యకర్తలంతా బంటి వెంబడి నడవాలని కోరుకుంటున్నట్టు తెలిపారు



# కరీంనగర్‌లో అడ్డగోలుగా రాజీవ్ స్వగృహ భూముల వేలం

## కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపణ



కరీంనగర్,జూన్20 **(సమ సమాజం):** జిల్లా కేంద్రం కరీంనగర్‌లో రాజీవ్ స్వగృహ భూములను అక్రమంగా వేలం వేస్తున్నారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. ఆనాటి కాంగ్రెస్ సర్కారు లబ్దిదారుల నుంచి తీసుకున్న డిపాజిట్ సొమ్ము నుంచి రూ.2 కోట్లతో 67 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించిందని తెలిపారు. సోమవారం కరీంనగర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూములను కలెక్టర్ అడ్డికి పావుసేరు చొప్పున అమ్ముతున్నారని మండిపడ్డారు. కోర్టు వివాదాలున్నా .. ఎలాంటి వివాదాలు లేవని కలెక్టర్ పత్రికా ప్రకటనలివ్వడం దారుణమని వ్యాఖ్యానించారు. రాజీవ్ స్వగృహ భూముల వేలం ద్వారా కొనుగోళ్లు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి రావచ్చని జీవన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కోర్టు వివాదాలు తొలగిపోతే ఆ భూముల విలువ 1000 కోట్ల రూపాయలకు చేరుతుందన్నారు. ఈ భూమి నిజానికి ఆనాటి స్వగృహ లబ్దిదారులకే చెందాలన్నారు. అటు కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటుంటే.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం భూములను అమ్ముకుంటోందని ఆయన కామెంట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి వల్ల కరీంనగర్ భవిష్యత్తు అవసరాలకు భూమి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రధాని మోడీ సభకు 10 లక్షల మంది

### నోవాటెల్ హోటల్‌లో ఏర్పాట్లు పరిశీలన

### పార్టీ నేతలతో కలిసి చర్చించిన సంజయ్



**హైదరాబాద్, జూన్ 20 (సమ సమాజం):** హైదరాబాద్‌లో నిర్వహించే ప్రధాని మోడీ సభకు 10 లక్షల మంది హాజరవుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. జులై 3 సాయంత్రం 4 గంటలకు జరగనున్న బహిరంగ సభ కోసం భారీ ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మరోవైపు వచ్చే నెల 2,3,4 తేదీల్లో హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఉంటాయన్నారు. పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తో పాటు 300 మందికి పైగా ప్రతినిధులు సమావేశాలకు హాజరవుతారని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిస్తే తప్పేంటని సంజయ్ ప్రశ్నించారు. ఈటల, అమిత్ షా భేటీపై అనవసర రాద్ధాంతం చేయొద్దని, జాతీయ నేతలను కలిసే స్వేచ్ఛ తమ పార్టీలో అందరికీ ఉంటుందని స్పష్టం చేశారు. ఉదయం నోవాటెల్లో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు భేటీయై పలు అంశాలపై చర్చించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, సమావేశాల స్టీరింగ్ కమిటీ సభ్యులు మీటింగ్ లో పాల్గొన్నారు. జులై 2 , 3 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ కార్యవర్గ సమావేశాలపై నేతలు చర్చించారు. అంతకు ముందు ఊఎలఅ లో కార్యవర్గ సమావేశాల ఏర్పాట్లను నేతలు పరిశీలించారు. సమావేశాల ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్ర పార్టీ నాయకత్వం ఇప్పటికే వివిధ కమిటీలను వేసింది. జాతీయ కార్యవర్గ సమావేశాలతో పాటు.. హైదరాబాద్ లో ప్రధాని మోడీ బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేయాలని నేతలు నిర్ణయించారు. సమావేశాల నిర్వహణ కోసం 50 వేల మంది నుంచి నిధి సేకరిస్తున్నట్లు సంజయ్ చెప్పారు. ఆల్ లైన్ లో మాత్రమే నిధి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కార్యవర్గ సమావేశాలకు వచ్చే ప్రతినిధులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం తో పాటు సమావేశాలకు వచ్చే ప్రతినిధులకు తెలంగాణ వంటకాలు రుచి చూపించనున్నారు. ఇప్పటికే వంటలకు ఆర్డర్ ఇచ్చారు. నోవాటెల్ సిబ్బందితో భేటీ అయిన నేతలు... వంటలపై మాట్లాడారు. మెనూలో ఉలువచారు, దోసకాయ పప్పు, మామిడి కాయ తొక్కు, చిక్కుడుకాయ, ఆలు, తెలంగాణ పచ్చిపులుసుతో పాటు బక్షాలు, గర్జలు ఆర్డర్ ఇచ్చారు.

# అసంపూర్తి గానే కాకతీయ పనులు?

### శిఖం భూముల్లో పనులకు ఆటంకం

**వరంగల్, జూన్ 20 (సమ సమాజం):** వర్షాకాలం వచ్చినా మిషన్ కకాతీయ పనులు అసంపూర్తిగానే ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అట్టహాసంగా వీటిని ప్రారంభించినా పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఈ నేపథ్యంలో గతంలో చేపట్టిన పనులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5000కు పైగా జలాశయాలను ఎంపిక చేసింది. ఒకటో దశలో చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. రెండో దశలో ఇంకా చాలా వరకు పూర్తి కావాలి. ఫిబ్రవరిలో మూడో విడతకు సర్కారు రంగం సిద్ధం చేసింది. అయిదు జిల్లాల్లోని చెరువులకు నిధులు మంజూరు చేసింది. పూడికతీతకు వేసవి కాలమే అనుకూలం కావడంతో పనులుచేపట్టారు. పూడిక మట్టిని రైతులు తమ పొలాల్లో పోసుకోవాల్సి ఉంది. వానలు లేనప్పుడే ఇవన్నీ సాఫీగా జరుగుతాయి. అయితేమొదటి దశలో ఉన్న ఉత్సాహం నాలుగోదశకు వచ్చేవరకు కానరాలేదు. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం లేకపోవడమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. అధికారులు మొదటి, రెండో దశల్లో చాలా వాటికి హద్దులు నిర్ణయించకుండానే పనులు మొదలు పట్టేశారు. క్రమంలో పెద్ద మొత్తంలో గుత్తేదారులు తమ ఇష్టారీతిన ప్రయివేటు వ్యక్తుల స్థలాల్లోనూ పూడిక తీయడంతో అనేక చోట్ల వివాదాస్పదమైంది. చాలా చోట్ల ఆక్రమణకు గురైన శిఖం భూముల్లోనూ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఇదే తీరు మూడో దశలోనూ కొనసాగింది. అందుకే వర్షాకాలం వచ్చినా ఇంకా పనులు అసంపూర్తిగానే మిగిలాయి.

# టీచర్ల పరస్పర బదిలీలకు అవకాశం

### ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం

### హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు



**హైదరాబాద్, జూన్ 20 (సమ సమాజం):** రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు సంబంధించి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై చర్చించారు. పరస్పర బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 2,558 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రయోజనం కలగనుందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరస్పర బదిలీల కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ వ్యాప్తంగా 2,558 మంది ఉద్యోగులకు ప్రయోజనం పొందుతారు. టీచర్ల పరస్పర బదిలీలకు ఉత్తర్వులు ఇవ్వాలని మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని జిల్లా, జోనల్, మల్టీ జోనల్ క్యాడర్ల ఉద్యోగుల పరస్పర బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, ఒక జోన్ నుంచి మరో జోన్‌కు, ఒక మల్టీ జోన్ నుంచి మరో జోన్‌కు పరస్పర బదిలీలు కోరుకునే ఉద్యోగులు, అధికారుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. అయితే... ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పరస్పర బదిలీ కోరుకునేవారికి ఎలాంటి సీనియారిటీ రక్షణ ఉండదంటూ మొదట్లో జారీ చేసిన జీవో 21లో ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పరస్పర బదిలీలు కోరుకునేవారి సీనియారిటీని పరిరక్షించాలని సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు జిల్లా క్యాడర్ పోస్టుల పరస్పర బదిలీలకు సీనియారిటీ రక్షణ కల్పిస్తూ మళ్లీ 402 జీవోను ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవోపై కొందరు ఉద్యోగులు కోర్టుకు వెళ్లారు. సీనియారిటీ రక్షణతో ఇతర జిల్లాల నుంచి వచ్చే ఉద్యోగుల కారణంగా అప్పటికే ఆయా జిల్లాల్లో పని చేస్తున్న తమ సీనియారిటీలో తేడాలు వస్తాయని, కొత్తగా వచ్చేవారు తమకంటే సీనియర్లు అయ్యే అవకాశముందంటూ కోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు కోర్టు 402 జీవోను సస్పెండ్ చేసింది. దాంతో పరస్పర బదిలీలు నిలిచిపోయాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చిరస్మరణీయుడు మిమిక్రీ వేణుమాధవ్

### ప్రపంచానికి మన ప్రతిభను చాటిన మహనీయుడు



**వరంగల్, జూన్ 20 (సమ సమాజం):** మిమిక్రీ అనే కళను ప్రపంచానికి పరిచయం చేసి, దానిని ఐక్యరాజ్య సమితి వరకు తీసుకెళ్లిన ధీశాలి మన నేరెళ్ల వేణుమాధవ్ ధన్యజీవి. అంతటి మహానుభావుడు ఓ సామాన్యుడిలా మన కళ్లముందే నడయాడి మనలను వీడి వెళ్లారు. జూన్ 19న ఆయన వర్ధంతి. ఆయన ప్రేమించి, ప్రవచించిన మిమిక్రీని సజీవంగా మనకందించారు. మిమిక్రీ ఉన్నన్నాళ్లూ నేరెళ్ల వేణుమాధవ్ మనకు సాక్షాత్కరిస్తూనే ఉంటారు. వరంగల్ నుంచి ప్రారంభమైన నేరెళ్ల వేణుమాధవ్ మిమిక్రీ ప్రస్థానం ఐరాస వరకు వెళ్లిందంటే తెలుగువారిగా మనకన్న గర్వించేవారు ఉండరు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలంలోనే అమెరికాలో ప్రదర్శనకు అవకాశం రావడంతో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగినప్పుడు తెలుగువారి గుండెలు మరింత పులకించి ఉంటాయి. ఆనాటి ఘటనలు తలుచుకుంటే నేటికీ మనం పులకించకుండా ఉండలేం. ఓ కళను సృష్టించిన స్రష్ట ఆయన. దానిని శబ్దప్రక్రియగా ఓ సబ్జక్టుగా రూపొందించి భావి తరాలకు మార్గం చూపారు. అయినా పురాణాల్లోనే ఇలాంటి చాతుర్యం ఉందని, అదంత భగవత్ కృప అని చెప్పుకుని, తన గొప్పతనమేమీ లేదని చెప్పుకోవడం ఆయన ఉదాత్తకు తార్కాణం. తనకు అబ్బిన మిమిక్రీ కళను ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రదర్శనలుగా ఇవ్వడం ఒక ఎత్తయితే 1971లో ఐక్యరాజ్య సమితిలో ప్రపంచ ప్రముఖుల గొంతులను అనుకరించి ప్రపంచం దృష్టినీ ఆకర్షించడం మరొక ఎత్తు. తన గొంతులో వెయ్యి గొంతుకలను పలికించడం ద్వారా మిమిక్రీ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కళాకారుడు తెలుగువాడయినందుకు... భారతీయుడైనందుకు మనమంతా గర్వపడాలి. పదో ఏటలోనే మిమిక్రీ కళపై మక్కువ పెంచుకున్న నేరెళ్ల తన ఆశయం మేరకు మిమిక్రీపైనే దృష్టి సారించి దానిని జగద్విఖ్యాతం చేయకుండా ఉండివుంటే ఇవాళ మిమిక్రీ అన్నది ప్రపంచానికి తెలిసేది కాదు. ఆయన జీవితం ఓ పాఠం. ఆధునిక తరానికి ఓ సక్సెస్ స్టోరీ. పోతన పుట్టిన ఓరుగల్లులో పుట్టిన మట్టిబిడ్డగా వేణుమాధవ్ తన గళం బలంతో ప్రపంచాన్ని శాసించారు. తొలితరం నటుడైన చిత్తూరు నాగయ్య స్వరాన్ని అనుకరించడం ద్వారా తన కళా ప్రస్థానానికి బాటలు వేసుకున్నది మొదలు ఆయన గొంతుకలో ఎందరి గొంతుకలు ఇమిడి పోయాయో చెప్పలేం. మహామహులే ఆయన గొంతుకకు పాదా క్రాంతులయ్యారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా..తనకు గుర్తింపు తెచ్చిన మిమిక్రీని మాత్రం వదలకుండా పెనవేసుకుని పోయారు. అలా మొదలైన ప్రస్థానం పది వేల ప్రదర్శనల వరకు కొనసాగిం దంటే ఆయన పట్టుదల ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. మిమిక్రీకి ఏమాత్రం గుర్తింపు లేని రోజుల్లోనే ఆ కళపై మక్కువ పెంచుకుని దానికి అర్థం పరమార్థం చెప్పి ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మన వేణు మాధవ్ ధన్యజీవి. ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. వివిధ రాష్ట్రాల్లో ఆయన లెక్కలేనన్ని పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. తిరుపతిలో అభిమానుల నుంచి గజారోహణ సత్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లక్షా నూటా పదహారువేల నగదు పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. గత మూడేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టినరోజును మిమిక్రీ దినోత్సవంగా నిర్వహించడం విశేషం.

# అగ్నిపథ్ పథకంపై టిఆర్ఎస్ విమర్శల జోరు

### పథకాన్ని వెన్నకి తీసుకోవలని డిమాండ్

### మోడీ తీరుపై మరోమారు కెటిఆఆర్ విమర్శలు



**హైదరాబాద్, జూన్ 20 (సమ సమాజం):** కేంద్రం ప్రకటించిన అగ్నిపథ్ స్కీమ్‌పై టిఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తూనే ఉంది. దీనిని రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌ను తెరపైకి తీఉసుకుని వెలుతున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా మరోమారు స్పందించారు. శ్రీలంక పవన విద్యుత్ కాంట్రాక్టుల్లో మోదీ, అదానీ అవినీతి బంధంపై దేశం దృష్టిని మరల్చడానికే అగ్నిపథ్ స్కీమ్‌ను ప్రకటించరా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక అగ్నిపథ్ స్కీమ్‌ను సమర్థిస్తున్న కేంద్ర మంత్రులపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. అగ్నిపథ్ పథకం యువతకు డ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, బార్బర్‌లు, వాషర్‌మెన్‌గా ఉపాధి కల్పించడంలో సహాయపడుతుందని చెప్పడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. అగ్నివీర్లను సెక్యూరిటీ గార్డులుగా నియమిస్తామని మరో కేంద్ర మంత్రి చెప్పడాన్ని కూడా కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మోదీని అర్థం చేసుకోలేదని మీరు యువతను నిందిస్తున్నారా అని కేటీఆర్ ప్రశ్నించారు. యువత ఆశల్లో నీళ్లు చల్లే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ సైనికులను బలహీన పరిచే విధంగా అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చారని, దీన్ని దేశవ్యాప్తంగా సైనికులు, యువత వ్యతిరేకిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కేవలం నాలుగు సంవత్సరాలే పని చేయించుకొని ఆ తర్వాత పదవీ విరమణ ఇవ్వడం సరైంది కాదన్నారు. దేశ రక్షణ విభాగం ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అలాంటి పథకాన్ని ప్రధాని మోదీ తీసుకురావడం దురదృష్టకరమన్నారు. భేషజాలకు పోకుండా ఈ పథకంలో కొన్ని మార్పులు చేసి యువత కు ఉపయోగపడే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములను కేంద్రానికి అప్పగించిందని ఆ భూములను కేంద్రం అమ్మేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర భూములను అమ్మే హక్కు కేంద్రానికి లేదని చెప్పారు. మోదీ తీసుకు వచ్చే పథకాలు ప్రజా వ్యతిరేకంగా ఉంటున్నా యని, గతంలో వ్యవసాయ చట్టాల తీసుకొచ్చి వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు యువతకు నష్టం చేకూర్చే విధంగా అగ్నిపథ్ పథకం తీసుకోవడం సరికాదన్నారు. రాహుల్ గాంధీపై కేంద్రం ఈడీ కేసులు పెట్టినా కాంగ్రెస్ నాయకత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. మిర్యాలగూడ మీదుగా వెళ్లే నారాయణాద్రి, నర్సాపూర్, విశాఖ, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లను మిర్యాలగూడలో నిలుపుదల చేసేందుకు ఉన్నత అధికారులకు సిఫారసు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వరరావు, చీమల మల్లయ్య యాదవ్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, బాసాని గిరి, ఇలియాజ్, షోయబ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చలన చిత్రం




## శభాష్ మిథు ట్రైలర్ విడుదల

టీమిండియా మాజీ క్రికెటర్, భారత క్రికెట్‌కు సుమారు రెండు దశాబ్దాల పాటు సేవలందించిన మిథాలీ రాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న 'శభాష్ మిథు' ట్రైలర్ విడుదలైంది. సోమవారం ఉదయం చిత్ర బృందం ఈ ట్రైలర్ ను విడుదల చేసింది. 2.44 నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్ ను మిథాలీ రాజ్.. తన సామాజిక మాధ్యమ ఖాతాలలో అభిమానులతో పంచుకుంది. శ్రీజిత్ ముఖర్జీ దర్శకుడిగా బాలీవుడ్ లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో మిథాలీ రాజ్ గా ప్రముఖ నటి తాప్సీ పన్ను నటిస్తున్నది. 'మెన్ ఇన్ బ్లూ మాదిరిగానే మనకు కూడా ఉమెన్ ఇన్ బ్లూ అనే ఓ జట్టు ఉంటే బాగుంటుందని నేను ఎనిమిదేండ్ల నుంచి కలలు కంటున్నాను..' అని తాప్సీ చెప్పే డైలాగ్ తో ట్రైలర్ మొదలవుతుంది. ఈ సినిమాలో మిథాలీ చిన్ననాటి నుంచి క్రికెటర్ కావాలని పడిన ఆరాటం.. క్రికెటర్ గా ఎదిగే క్రమంలో ఆమె ఎదుర్కున్న అవమానాలు, ఆటలో ఆమె చూసిన ఎత్తుపల్లాలు.. భారత మహిళా క్రికెట్ కు గుర్తింపు తీసుకురావడం కోసం ఆమె చూపిన తెగువను చూపించారు. ట్రైలర్ చూశాక ఇదే విషయం స్పష్టమవుతున్నది. ఇక ట్రైలర్ ను అభిమానులతో పంచుకుంటూ మిథాలీ.. 'ఒక ఆట.. ఒక దేశం.. ఒక ఆశయం.. నా కల! ఈ టీమ్ కు కృతజ్ఞతలు. నా కథను మీతో పంచుకుంటున్నందుకు సంతోషంగా ఉంది..' అని రాసుకొచ్చింది. మిథాలీగా తాప్సీ అదరగొట్టింది. కొన్ని సందర్భాల్లో అయితే తాప్సీ అచ్చం మిథాలీని దింపేసింది. పలు సన్నివేశాల్లో ఆమె చూపిన నటనకు అభిమానులు ఫిదా అవుతున్నారు. జులై 15 న ఈ సినిమా విడుదల కానుంది.

## కార్తికేయ -2 పై నిఖిల్ అభిమానుల్లో ఉత్సుకత




యువ హీరో నిఖిల్ వరుస సినిమాలతో జోరుమీదున్నాడు. 'అర్జున్ సురవరం' తర్వాత ఇప్పటివరకు ఈయన నుంచి మరో సినిమా రాలేదు. ఈ మూడేళ్ళ గ్యాప్‌ను పూర్తి చేసేందుకు నిఖిల్ వరుసగా సినిమాలను ఒప్పుకుంటున్నాడు. ప్రస్తుతం ఈయన చేతిలో నాలుగు సినిమాలున్నాయి. అందులో కార్తికేయ-2 ఒకటి. చందు ముండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం కార్తికే య చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కింది. 2014లో వచ్చిన 'కార్తికేయ' ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికి తెలిసిందే. రూ.6 కోట్లతో నిర్మితమైన ఈ చిత్రం రూ.20 కోట్ల వరకు కలెక్షన్లు సాధించి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. దాదాపు 8 ఏళ్ళ తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కింది. 'కార్తికేయ-2' తెరకెక్కుతుందని అనౌన్స్ చేసినప్పటి నుంచే ప్రేక్షకులలో భారీ స్థాయిలో అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్, పాత్రల పరిచయం వీడియో సినిమాపై అంచనాలను రెట్టింపు రెట్టింపు చేశాయి. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం జూలై 22న విడుదల కానుంది. ఈక్రమంలో మేకర్స్ అప్‌డేట్‌లను స్టార్ చేశారు. కాగా తాజాగా చిత్రానికి సంబంధించిన టీజర్ డేట్‌ను చిత్ర యూనిట్ ప్రకటించారు. ఈ సినిమా టీజర్‌ను జూన్ 22న విడుదల చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో నిఖిల్, అనుపమ ఓ ఫన్నీ వీడియో చేస్తూ ప్రకటించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అనుపమ పరమేశ్వరణ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బేనర్స్‌పై టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మించారు. కాల భైరవ సంగీతం అందించిన ఈ చిత్రం తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

## హిట్ టాక్‌తో దూసుకెళ్తున్న విరాటపర్వం

టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన సినిమాల్లో 'విరాటపర్వం' జూన్ 17న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ హిట్‌టాక్‌తో దూసుకుపోతుంది. తొలిసారి నక్సలిజం నేపథ్యంలో ఓ ప్రేమ కథా చిత్రం కావడంతో ప్రేక్షకులను ఈ మూవీ బాగా ఆకట్టుకుంటుంది. అందులోనే 1990లో నక్సలైట్ల చేతిలో హత్యకు గురైన సరళ అనే యువతి జీవితంలో చోటుచేసుకున్న సంఘటనల ఆధారంగా విరాట పర్వం రూపొందింది. రానా కామ్రేడ్ రవన్న పాత్ర పోషించగా.. సాయి పల్లవి లీడ్‌రోల్‌లో కనిపించింది. ఇక ప్రియమణి, నవీన్ చంద్ర తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఇక ఈ మూవీలో రానా, సాయి పల్లవిల నటలకు ప్రేక్షకులతో పాటు సినీ ప్రముఖులు సైతం ఫిదా అవుతున్నారు. ఇప్పటికే దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావుతో పాటు చిరంజీవి, వెంకటేశ్ వంటి స్టార్ హీరోలు ఈ మూవీని కొనియాడారు. తాజాగా తమిళ స్టార్ డైరెక్టర్ సైతం విరాట పర్వం మూవీపై స్పందించడం విశేషం. ప్రముఖ తమిళ డైరెక్టర్ పా రంజిత్ సోషల్ మీడియా వేదికగా విరాట పర్వం మూవీపై ప్రశంసలు కురిపించాడు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేస్తూ.. 'ఈ మధ్య కాలంలో నేను చూసిన సినిమాల్లో విరాట పర్వం అత్యుత్తమైంది. ఎక్కడా రాజీ పడకుండా ఈ మూవీని అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు వేణు ఉడుగుల, నిర్మాతలు ప్రశంసలకు అర్హులు. రానా వంటి స్టార్ హీరో ఇలాంటి పాత్రను అంగీకరించి చేసినందుకు అతడిని ప్రత్యేకంగా అభినందించాల్సిందే. ఇక సాయి పల్లవి అయితే చాలా అద్భుతంగా నటించింది. ఇలాంటి మంచి సినిమాను అందించిన మూవీ టీమ్‌కు స్పెషల్ థ్యాంక్స్' అంటూ రాసుకొచ్చాడు. కాగా, విరాట పర్వం చిత్రాన్ని సురేశ్ ప్రొడక్షన్స్, శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్లో సుధాకర్ చెరుకూరి, సురేశ్ బాబులు సంయుక్తంగా నిర్మించారు.



## ది వారియర్ చిత్రంతో వస్తున్న రామ్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్యాక్ టు బ్యాక్ కథలను ఓకే చేస్తూ సెట్స్ పైకి తీసుకెళ్తున్నాడు. రామ్ లేటెస్ట్ చిత్రం 'ది వారియర్'. తమిళ దర్శకుడు ఎన్. లింగుస్వామి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. దానికి తోడు సినిమా నుండి విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్ అంచనాలను రెట్టింపు చేశాయి. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 14న విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుసగా అప్‌డేట్‌లను ఇస్తుంది. కాగా తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇటీవలే రామ్ 'ది వారియర్' చిత్రాన్ని వీక్షించాడట. సినిమా అవుట్ పుట్ అద్భుతంగా రావడంతో ఎంతో ఎగ్జైట్‌మెంట్‌కు గురైయ్యాడట. దీంతో వైజాగ్ ఏరియా థియేట్రికల్ హక్కులను రామ్ కొనుగోలు చేశాడని టాలీవుడ్ వర్గాల్లో సమాచారం. దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. కృతి శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించాడు. ఇప్పటికే చిత్రం నుంచి విడుదలైన 'బు÷-లలెట్' సాంగ్ యూట్యూబ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. ఇప్పటివరకు ఈ పాటకు 11కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మించాడు. ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్రలో నటించిన ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళంలోనూ ఏకకాలంలో విడుదల కానుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com